
కథ

# సమన్వయం

డా. కోరారి వాణీ చలపతిరావు

''అర్చనా! మీ అమ్మగారు, నాన్నగారు వచ్చారు'' అంది శైలజ వంటింట్లో పనిచేసుకుంటున్న మరదలు అర్చనను ఉద్దేశించి. ఆ మాటలు చెవులబడగానే అర్చన మనసు ఆనందంతో జలతరంగిణి అయింది.

చేస్తున్న పని వదిలేసి గబగబా బయటికి వచ్చి చిరునవ్వు ముఖంలో తల్లిదండ్రులకు ఎదురెళ్లి ''బాగున్నావా అమ్మా...ఆరోగ్యం బాగుంటోందా నాన్నా?'' అంటూ కుశల ప్రశ్నలు వేసి చేతిలోని బ్యాగు, సూట్‌కేసు



అందుకుని లోపలికెళ్లింది అర్చన.

''కాళ్లు కడుక్కోండి'' అంటూ మగ్‌తో నీళ్లు అందించింది. తమ కూతురు పెద్ద ఆరిందాలా తమకే మర్యాదలు చేస్తుంటే చూసి ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుంది వినోదిని. పైటకొంగు నడుమున దోపి రేగిన జుట్టును సవరించుకుంటూ ముఖం మీది చిరుచెమటను తుడుచుకోవాలనే ధ్యాస కూడా లేకుండా వంటింట్లో నుంచి వస్తున్నప్పుడే కూతురు అర్చనను చూసి ఆశ్చర్యపోయాడు తండ్రి విఠల్‌రావు. పెళ్లికాక ముందు తమ ఇంట స్వేచ్ఛగా ఎలా పెరిగినా పెళ్లయి అత్తవారింటికి వెళ్లాక ఇంటెడు బాధ్యతలను నెత్తిన వేసుకుని అందరికీ తలలో నాల్కలా తమ కూతురు మెలుగుతూ పుట్టింటికి పేరు తెచ్చేదిగా ఉంటే ఏ ఆడపిల్లను కన్న తల్లిదండ్రులకయినా అంతకన్నా గర్వకారణం మరేముంటుంది?

''బాగున్నారా మామయ్యగారూ?'' మర్యాదగా పలకరించాడు అల్లుడు కౌండిన్య.

''బాగున్నాను. మీరంతా ఎలా ఉన్నారు? మీకేదో ప్రమోషన్ వచ్చిందని చెప్పింది, అమ్మాయి. కంగ్రాచ్యులేషన్స్'' అంటూ అల్లుడితో మాటల్లో మునిగిపోయాడు విఠల్‌రావు.

వినోదిని చనువుగా లోపలికి వెళ్లింది వియ్యపురాలిని పలకరించటం కోసం.

ముందుగా ఎదురొచ్చిన అర్చన ఆడపడుచు శైలజను ''బాగున్నావా అమ్మా... ఎప్పుడొచ్చావు నువ్వు? మీ వారు...పిల్లలు బాగున్నారా?'' అంటూ కుశల ప్రశ్నలడిగింది. ఆ ప్రశ్నలకు శైలజ చిరునవ్వు కూడా నవ్వకుండా పొడిగా.

''బాగానే ఉన్నాం...ఇదేనా రావటం?'' అని అంది.

తులసికోట దగ్గర కూర్చుని ఉన్న వియ్యపురాలు రామేశ్వరిని ఉద్దేశించి-

''బాగున్నారా వదినగారూ! ఆరోగ్యం కులాసానా?'' అంటూ దగ్గరగా వెళ్లి మర్యాదగా పలకరించింది వినోదిని. ఆ గొంతు విని ఆమె ఒకసారి తలెత్తి కళ్లజోడులోంచి పైకీ కిందికీ ఎగాదిగా చూసి బలవంతాన ముఖం మీదికి ఒక చిరునవ్వు తెచ్చుకుని

''బాగున్నాను. అన్నయ్యగారు కూడా వచ్చారా? మీ చిన్నమ్మాయి ఆకృతి కూడా వచ్చిందా?'' అని అడిగింది దీర్ఘంతీస్తూ.

''ఆయన వచ్చారు. అమ్మాయి రాలేదు...అర్చన గర్భవతి అని తెలియగానే మనసు ఉండబట్టలేక వెంటనే బయలుదేరి వచ్చాం ఇద్దరం'' అంటూండగానే చేతిలో కాఫీగ్లాసులతో అక్కడికి వచ్చింది అర్చన.

''వేవిళ్లు బాగా అవుతున్నాయా అమ్మా...అన్నం సయిస్తోందా?'' అని అడిగింది వినోదిని.

''అప్పుడప్పుడూ అవుతున్నాయి...మోర్నింగ్

టైమ్‌లోనే ఎక్కువ. అన్నం ఫరవాలేదు తింటున్నాను'' అంటూ తల్లికి ఓ గ్లాసు అందించి అత్తగారికి మరో గ్లాసి వ్వబోతుంటే ''నాకెందుకు? మీ అమ్మకివ్వు చాలు'' అంది రామేశ్వరి.

మౌనంగా లోపలికి వెళ్లిపోయింది అర్చన. తల్లీ దండ్రీ ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుంచీ గమనిస్తోంది. ఆడపడుచు శైలజ మీ అమ్మగారు, నాన్నగారు వచ్చారు...అని చెబుతూ 'మీ' అన్న మాటను వత్తి పల కుతూ ముఖం అదోలా పెట్టి ఆవిడా, బలవంతాన నవ్వుతూ, మొక్కుబడిగా పలకరిస్తూ, ఇప్పుడు ఇలా ''మీ అమ్మ'' అంటూ వ్యంగ్యంగా దెప్పుతూ అత్త గారు- బాధ అనిపించింది అర్చనకు. ఇంతకు ముందూ ఒకటి రెండుసార్లు వచ్చినప్పుడు ఇంతే! కాఫీ గ్లాసులు ముందు గదిలో కూర్చున్న తండ్రికి, భర్తకు పట్టుకెళ్లి ఇచ్చింది అర్చన.

''టిఫిన్ ఇంకా కాలేదా?'' అడిగాడు కౌండిన్య భార్యనుద్దేశించి.

''అవుతోంది?'' అంది అర్చన.

''ప్రయాణం చేసి అలసిపోయి వచ్చారు మామ య్యగారు వాళ్లు త్వరగా కానీ..స్నానానికీ వేడినీళ్లు పెట్టావా?''

ఆ ఆదరణకు అర్చన మనసు ఆనందంతో పొంగిపో యింది.

''మీ అమ్మ...మీ నాన్న'' అనకుండా తన భర్త కౌండిన్య 'అత్తయ్యగారు, మామయ్యగారు' అనడం వాళ్ల 'అలసట' గురించి, 'ఆకలి' గురించి ఆలోచిస్తూ అతిథి సత్కారాలను మనస్ఫూర్తిగా చేయటం ఎంతో తృప్తినిచ్చింది అర్చనకు.

పొయ్యిమీద నుంచి ఇడ్లీలు దింపి హాట్‌ప్యాక్‌లో వేస్తుంటే...అక్కడికి వచ్చిన ఆడ పడుచు శైలజ ''ఈ రోజు నువ్వు చాలా హ్యాపీగా ఉన్నావని నీ ముఖం చూస్తుం టేనే తెలిసిపోతోంది.. మీ వాళ్లు వచ్చారు కదా. అదీ కారణం. నీ ఎగ్జయిట్‌మెంట్‌లో ఈ రోజు నాకు సెకండ్‌టైమ్ కాఫీ ఇవ్వడం మర్చిపోయావ్'' అంది సాధింపుగా.

''అయ్యో...సారీ వదినా! ఇప్పుడే ఇస్తాను'' చకచకా ఇడ్లీల మీద మూతపెట్టి కాఫీ కలపటం మొదలుపె ట్టింది. మళ్లీ తనే-

''ఈ రోజేంటి వంటలో స్పెషల్?'' అని అడిగింది కాఫీ తాగుతూ.

''ఏముంది మామూలే. రోజూలాగానే'' అని క్లుప్తంగా సమాధానం ఇచ్చింది అర్చన.


'గెస్టులు వస్తే స్వీట్స్ ఏమీ చేయవా?'' అని శైలజ అంటూ ఉండగానే ఊరి నుంచి వినోదిని స్టీలు డబ్బాల్లో తెచ్చిన సున్నుండలు, అరిసెలు, చక్కిలాలు తెచ్చి కిచెన్ అరుగుమీద పెడుతూ రెండు తీసి ప్లేట్‌లో పెట్టి- ''శైలజా! తిని చూడు. ఎలా కుదిరాయో'' అంది.

''అయ్యో! నాకెందుకు? ఉండనివ్వండి మీ అమ్మాయికి'' అంది శైలజ.

## మమ్మీ సిమ్రాన్!

**తెలుగు, తమిళ సినీ రంగాల్లో దాదాపు దశాబ్దం పాటు ఓ వెలుగు వెలిగి తన చిర కాల ప్రియుడ్ని పెళ్లాడిన సిమ్రాన్ సినిమా లకు అఫీషియల్‌గా ఇంకా గుడ్‌బై చెప్పనే లేదు. సిమ్రాన్‌కి సంబంధించిన తాజా సమాచారం ఏంటంటే- ఆమె ఓ బిడ్డకి తల్ల యింది. ఇటీవలే ఆమె ఢిల్లీలో ఓ మగపిల్లా డికి జన్మనిచ్చింది.**

**ఇప్పుడు ఎక్కువగా జరుగుతున్నట్టుగా సిజేరియన్ కాకుండా సహజ ప్రసవమే నట. పిల్లాడికి తన అవసరం కాస్త తగ్గాక తిరిగి సిని మాల్లో సిమ్రాన్ నటించవ చ్చని ఆమె సన్నిహితులు చెబుతు న్నారు.**



''నువ్వూ మా అమ్మాయి లాంటిదానివే. అయినా అందరి కోసమని తెచ్చాను'' అంది వినోదిని.

''అమ్మాయ్ అర్చనా...కాసిని మంచినీళ్లి వ్వమ్మా...అబ్బబ్బ! ఎండ మండిపోతోంది'' అంటూ లోపలకు వస్తున్న మామగారు కనిపించగానే చకచకా ఫ్రిజ్ ఓపెన్ చేసి చల్లటి వాటర్ బాటిలు, గ్లాసుతో బయ టికి వెళ్లింది అర్చన. అప్పుడే విఠల్‌రావు కూడా కూర్చున్న చోటి నుంచి లేచి వియ్యంకుడికి ఎదురెళ్లి ''బావగారూ! నమస్కారం!'' అన్నాడు.

''ఎవరు? బావగారా? ఎప్పుడొచ్చారు? నేనింకా చూడనే లేదు మిమ్మల్ని. కులాసానా అక్కయ్యగారు కూడా వచ్చారా?'' అంటూ ఆదరంగా పలకరించాడు రంగనాథం.

మామగారు తన తండ్రిని అంతగా గౌరవించటం ఆనందం కలిగించింది అర్చనకు.

''ఎలా ఉంది బావగారూ బిజినెస్?'' అడిగాడు విఠ ల్‌రావు.

''ఆ ఏం బిజినెస్సో, ఏమిటో...పెట్టుబడికి ఎక్కడి డబ్బూ చాలదు. ఫలితాలు చూస్తే అంతంత మాత్రమే. శ్రమ తప్ప ప్రయోజనం కనబడటం లేదు. ఎంతయినా మీ వ్యవసాయదారులే నయంలెండి.''

''అయ్యో...మాకున్న కష్టాలు మీకెక్కడివండీ బావగారూ! వర్షాభావం, బోర్లలో నీళ్లు లేకపోవడం, కరెంటు కోత..అప్పులు...ఒకటా..రెండా? నష్టాల్లో గొంతువరకూ కూరుకుని పోయి ఉన్నామండీ బాబూ! పైగా ఇంకో పిల్ల పెళ్లికె దిగి కూర్చుంది. ఎంత లేదన్నా ఐదారు లక్షలయినా కావాలి. మీకేం ఒక అమ్మాయి...ఒక అబ్బాయి...ఇద్దరు పెళ్లిళ్లూ అయిపోయాయి. బాధ్యతలు లేవు.''

''అవును ప్లస్...మైనస్...నిల్ బ్యాలెన్స్...లెక్క సరిపోయింది..ఇక మీలాంటి ల్యాండలార్డ్సు ఒక చెయ్యి వేస్తేగానీ..బతుకు బండి నడవని పరి స్థితి. వ్యాపారస్థులకు ఎక్కడి డబ్బయినా పెట్టుబడికే సరిపోవన్న విషయం మీకూ తెలుసనుకుంటాను'' అన్నాడు రంగనాథం.


నవ్వలేక నవ్వాడు విఠల్‌రావు.

''ఆడపిల్లల తండ్రిని నన్నే అడిగారూ'' అన్నాడు ఏమనాలో అర్థంగాక.

''ఆడపిల్లల తండ్రుల పనే బాగుందండీ బావ గారూ...ఆస్తిపాస్తులు కూడబెట్టి ఇవ్వటానికి కొడు కులెవ్వరూ ఉండరు గనుక ఉన్నదేదో ఆడపిల్లకే ఇచ్చి చెయ్యి దులిపేసుకుంటే సరిపోతుంది''

ఆ సంభాషణంతా డైనింగ్ రూమ్‌లోనించి విన్నారు అర్చన, కౌండిన్య. బాధతో అర్చన, సిగ్గుతో కౌండిన్య...ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకోలేక తలలు వంచుకున్నారు.

ఉదయం లేచింది మొదలూ వంటింట్లో పొయ్యి దగ్గర కూతురు ఒక్కతే సతమతమవు తుంటే చూస్తూ ఊరుకోలేక తనూ వంటపనిలో



## 40 కోట్ల సినిమా?

**దక్షిణాదిలోనే అత్యధిక పారితోషికాన్ని తీసుకునే దర్శకుడిగా రికార్డు సృష్టిస్తున్న శంకర్‌కి చాలాకాలంగా ఓ సినిమా తీయాలని వుందిట. 'రోబో' ప్రధాన అంశంగా కమల్ హాసన్‌ని దృష్టిలో పెట్టుకుని తను తయారు చేసుకున్న కథని సినిమాగా తీయాలంటే కుదరడం లేదు. ఎందుకంటారా? ఆ సినిమా బడ్జెట్ అంచనా ఎంతో తెలుసా? అక్షరాలా 40 కోట్లుట. మరి ఇంత సొమ్ము ఇన్వెస్ట్ చేయగల నిర్మాత దొరకాలి కదా! అంతటి సాహసం ఎవరు చేయగలరు చెప్పండి. అందుకనే ఆ ప్రాజెక్ట్‌ని అలా పక్కన పెట్టి వుంచాడు శంకర్. మరి ఎప్పటికైనా ఈ సినిమా తయారవుతుందో లేదో?**

సాయం చేద్దామనుకుంది వినోదిని. సాయం ఎందుకు...నిజానికి కూతుర్ని వెళ్లి రెస్ట్ తీసుకోమని మొత్తం వంటా తనే చేద్దామని కూడా ఉంది ఆమెకు. కానీ వియ్యపురాలు ఏమనుకుంటుందోనని భయం. అప్పటికీ కాస్త కూరలు తరిగివ్వటం గ్రైండర్‌లో పచ్చడి రుబ్బి ఇవ్వటం లాంటి చిన్న చిన్న పనులు చేస్తుంటే వియ్యపురాలు అననే అంది. ''తిరుగుతూ పని చేసుకుంటుంటేనే బాగుంటుంది కడుపుతో ఉన్నవాళ్లకు...అందుకే నేను వంటింటి పనికి దూరంగా ఉండేది'' అంది. వినోదినికి నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు. తాలింపు వాసనలు, టీ వాసన పడటం లేదంటూ ఒక పక్కన పొయ్యి దగ్గర పనిచేస్తూ మరో పక్కన వాంతి చేసుకుంటూ వస్తోంది అర్చన. అది చూస్తూ కూడా ఈవిడ ఇలా మాట్లాడుతూంది. వచ్చిన దగ్గరినుంచీ తను చూస్తుంది. ఆడపడుచు శైలజ, వాళ్ల అమ్మ కూర్చున్న చోటి నుంచి కాస్త లేవటం ఆలస్యం- ''అమ్మా...నువ్వు లేవకు...రెస్టుగా కూర్చో చేసినంత కాలం చేశావ్...ఇప్పుడు కోడలు వచ్చాక కూడా నీకెందుకు శ్రమ. నీ కోడలు చేసుకుంటుందిలే'' అంటుంది. కూతురు శైలజ కాస్త అటు చెంబు తీసి ఇటు పెట్టడం ఆలస్యం ''నువ్వు ఊరుకోవే నాలుగు రోజుల కోసం చుట్టపుచూపుగా వచ్చిన ఆడపిల్లవు...నీకెందుకు మీ మరదలు చూసుకుంటుందిలే'' అంటుంది అమ్మ.

ఏవో శబ్దాలు వస్తుంటే అటు చూసింది వినోదిని. సందున అర్చన వాంతి చేసుకోవటం లోపల ఉన్నది బయటికి రాక హైరానా పడటం చూసి ఉండబట్టలేక పరుగున వెళ్లి అర్చన రెండు చెవులూ మూస్తూ తలను పట్టుకుంది. అది చూసి సహించలేకపోయింది అత్త రామేశ్వరి.

''వేవిళ్లకే తెగ గాబరా పడిపోతున్నారు వదిన గారు..మనమంతా వేవిళ్ల బాధలు అనుభవించలేదా పిల్లల్ని కనలేదా. ఎంతయినా కన్నతల్లి ప్రేమ! అయినా మీరు ఇవ్వాళ ఉంటారు రేపు వెళ్లిపోతారు. ఇంతకు ముందు చూసిందీ ఆ తరువాత చూడవలసిందీ నేనే కదా! అత్త ఎంత చేసినా అత్తే అంటారు గానీ అమ్మ అనరు కదా'' అంటూ మొదలుపెట్టింది.

ఆమె మాటల్ని పట్టించుకునే స్థితిలో లేదు వినోదిని.

''వదినగారూ అమ్మాయిని నాతో మా ఊరు పంపండి. కాస్త నాలుగు రోజులు ఉంచుకుని వేవిళ్లు తగ్గాక పంపిస్తాను'' అంది. ఆ మాటలు కోపం తెప్పించాయి రామేశ్వరికి.

''ఎందుకు? ఇది ఇల్లు కాదా. నేను పిల్లల్ని కన్న తల్లిని కాదా! నాకూ తెలుసు మంచీ చెడు. కష్టం, సుఖం'' అందిది. దాంతో కంగారుపడి-

''అయ్యయ్యో! నేను ఆ ఉద్దేశంతో అనటం లేదు'' అంది వినోదిని సంజాయిషీగా.

''ఉద్దేశాలు తెలుసుకోలేనంత తెలివితక్కువదాన్ని కాదు నేను. విప్పి మీరు చెప్పకపోయినా మీ మనసు నేను గ్రహించగలను'' అంది. ఇద్దరి మాటలూ విన్న అర్చన సహనం చచ్చిపోయి ''అమ్మా...నేను ఇప్పుడు ఎక్కడికీ రాలేను గానీ నువ్వు మాట్లాడకు'' అంది తల్లిని ఉద్దేశించి. రామేశ్వరి అంది మళ్లీ-

''ఇంకొక నెల ఆగితే ఎలాగూ సీమంతం చేయటానికి మీరు ఇక్కడికి రావాలి. అప్పటిదాకా వేవిళ్లు తగ్గకపోతే అప్పుడు చూద్దాం. ఆడ పుట్టుక పుట్టాక వేవిళ్లు, పురిటినొప్పులు తప్పవు మరి. ఇప్పుడే మొదలా? సృష్టి మొదలైనప్పుడే ఇవన్నీ మొదలైనాయి'' అంటూ కాసేపు వేదాంతధోరణితో మాట్లాడి ఆ తరువాత టాపిక్ మారుస్తూ

''సీమంతానికి మా వాళ్లు చాలామంది వస్తారు ఇక్కడికి. కాస్త ఏం తెచ్చినా నలుగురిలో ఘనంగా ఉండేలా తెండి''

''అలాగే వదినగారూ...మా అమ్మాయికి అన్నీ వేడుకగా జరిపించాలని మాకు మాత్రం ఉండదూ'' అంది వినోదిని.

ఉన్నట్టుండి రామేశ్వరి ''మళ్లీ తిరుగు ప్రయాణం ఎప్పుడు పెట్టుకున్నారేంటి? ఎందుకడుగుతున్నానంటే ఆడపిల్లను ఇచ్చుకున్న ఇంట్లో రెండు మూడు రోజుల కన్నా ఎక్కువ మేము ఉండమన్నా మీరుండరు కదా అదీ గాక ట్రైన్‌లో తినటానికి రొట్టెలు చేయిద్దామని అడుగుతున్నాను'' అంది.

మనసు చివుక్కుమనిపించింది వినోదినికి. ''ఈ రాత్రికి వెళ్లిపోతున్నామండీ'' కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి అర్చనకు. అటుగా వెళుతున్న కౌండిన్య వంటింట్లో ఆడవాళ్ల మధ్య ఏదో జరుగుతోందని గ్రహించి ఒక్క క్షణం ఠక్కున ఆగిపోయాడు. ఆ ఆఖరి మాటలు అతని చెవిన పడనే పడ్డాయి. అమ్మ స్వభావం అతనికి తెలిసిందే. అర్చన కాపురానికి వచ్చిన దగ్గరి నుంచీ ఆవిడ అత్తగారి పెత్తనం, అక్క శైలజ ఆడపడుచు అథారిటీ వాటి అన్నింటినీ అతనూ సైలెంట్‌గా అబ్జర్వ్ చేస్తూనే ఉన్నాడు. పెళ్లాం రాగానే తల్లిదండ్రులను లక్ష్యపెట్టటం లేదని మనిషి మారిపోయాడనీ ఎక్కడ అనుకుంటారోనని భయం. తనను నమ్ముకుని తన వాళ్లను వదులుకుని అన్నీ ఇక నాకు ఈ ఇల్లే...ఈ ఇంటివాళ్లే... ఇక నావాళ్లు అన్న నమ్మకంతో వచ్చిన తన జీవితభాగస్వామిని అర్చనకు ఆ ఇంట్లో సముచిత స్థానం, ఆ కుటుంబ సభ్యుల హృదయాల్లో ప్రేమ దొరకటం లేదన్న అనుమానం అతన్ని పీడించసాగింది. అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నాడు కౌండిన్య. ఇప్పుడు చుట్టపు చూపుగా వచ్చిన అత్తగార్ని మర్యాదచేయకపోగా 'మీ రాక మాకు అయిష్టం' అన్నట్లుగా అవమానించటం బాధ అనిపించింది. అయినా మౌనంగా భరించటం తప్ప...వచ్చిన వాళ్లను చూసి జాలిపడటం తప్ప ఎవ్వరినీ ఏమీ అనలేదు.

★ ★ ★

అర్చనకు కాన్పయి ఆడపిల్ల పుట్టింది.

బారసాల కోసమని అత్తింటి నుంచి అత్తమామలు, ఆడపడుచు శైలజ, భర్త కౌండిన్య వచ్చారు. ముద్దులొలికే పాపను మురిపెంగా చూసుకుంటూ తన బుజ్జి, బుజ్జి బుగ్గలను నిమురుతూ ఆడుకుంటున్నాడు కౌండిన్య.

వస్తూనే అత్తగారు రామశ్వరి వియ్యపురాలినుద్దేశించి- ''వంశోద్ధారకుడు పుడతాడని ఆశపడ్డాం. ఆడపిల్ల పుట్టింది. తల్లి చాలు...ఎక్కడికి పోతుందీ?'' అని దీర్ఘం తీసింది.

'తొలిచూలు మీకూ ఆడపిల్లే కదా! మీ చాలు వస్తే ఈసారి మగపిల్లవాడు పుడతాడులెండి!' అందామనుకుంది వినోదిని. కానీ అనలేదు మాటకు మాట బదులుచెప్పినట్లు అవుతుందని!

వియ్యాలవారికి ఏ లోటూ రాకుండా సకల మర్యాదలూ చేస్తూ ఒకపక్క, బారసాలకు కావల్సిన ఏర్పాట్లు చేస్తూ మరోపక్క హడావుడిగా అటూ ఇటూ తిరుగుతూ పనులు చేసుకుంటోంది వినోదిని. చిన్నకూ

తురు ఆకృతి ఆమెకు సహాయం చేస్తోంది. రామేశ్వరి, శైలజ ఇద్దరూ పాప మంచం మీద కూర్చుని ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

''అమ్మా...పాప ఎవరి పోలికో చెప్పు'' అంది శైలజ.

''కళ్లు అచ్చం మేనత్తవే...అంటే నీవే! రంగు మీ నాన్నగారిది. పోలికలు మీ అన్నయ్యవే. ఆడపిల్లలకు తండ్రి పోలికలు వస్తే అదృష్టవంతులు అవుతారు అని అంటారు'' అంది రామేశ్వరి.

''అన్నయ్య అచ్చం నీలాగానే ఉంటాడు కదా. అంటే పాపలో బామ్మ పోలికలు కూడా ఉన్నట్టేగా మరి. నేను చూడగానే అనుకున్నాను. నా మేనకోడలు అచ్చం అమ్మలా ఉందే అని'' అంది శైలజ.

వంటింట్లో... పొయ్యిమీద పాలగిన్నె పెడుతూ తనలో తనే నవ్వుకుంది వినోదిని బయటి నుంచి వినవచ్చిన వాళ్ల సంభాషణకు. అటూ ఇటూ తిరుగుతూ ఆ మాటలు ఆకృతి మాత్రం ఊరుకోలేక ''ఆ ముక్కు మాత్రం అమ్మది అంటున్నారు అంతా'' అంది.

''ముక్కు మీ అమ్మదా? భలేదానివే...అమ్మమ్మ పోలికలు ఎందుకొస్తాయి ఎవరికయినా...అయినా మీ అమ్మకు అంత కొటేరు తేలిన ముక్కు ఎక్కడుందీ'' అని దీర్ఘం తీసింది రామేశ్వరి. దాంతో వంటింట్లో ఉన్న వినోదినికి కంగారేసి ''ఆకృతీ! ఇలా రా ఒకసారి. అక్క జుట్టుకు సాంబ్రాణి పొగ వేయాలి. నిప్పుచెయ్'' అని కేకేసింది కూతుర్ని. అమ్మ సమయానికి అలా ఎందుకు పిలిచిందో ఆకృతి గ్రహించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అత్తగారి సమయస్ఫూర్తిని, మంచితనాన్ని అల్లుడు కౌండిన్య కూడా మనసులోనే మెచ్చుకున్నాడు.

టిఫిన్లు కానిచ్చేశాక వియ్యంకుడికి ఇల్లు, వాకిలి, గొడ్లచావిడి, ధాన్యపు కొట్లలు అన్నీ తిప్పి చూపించాడు విఠల్‌రావు. మామూలుగా చూస్తున్నట్టే చూస్తూ మనసులోనే ఆస్తిపాస్తులకు అందాజా లెక్కలు వేస్తున్నాడు రంగనాథం.

హాల్లో చాప మీద కూర్చున్న రామేశ్వరి వియ్యపురాలితో మాట్లాడినట్లే మాట్లాడుతూ కోడలి డెలివరీకి సంబంధించిన ప్రశ్నలను... ప్రశ్న వెంట ప్రశ్నగా సంధించి వదిలిపెడుతోంది.

''పత్యం బాగా చేయిస్తున్నారా అమ్మాయితో?''

''పాలు బాగా పడటానికి రోజూ ఉదయం, సాయంత్రం పాలు తాగమని చెబుతున్నారా?''

''పిల్లకు బాగా వేడినీళ్లతో నలుగుపెట్టి స్నానం చేయిస్తున్నారు కదా? పసిపిల్లలకు స్నానమే బలం.''

''ఉగ్గు పెడుతున్నారా వేళ తప్పకుండా?''

''గ్రైప్‌వాటర్ పడుతున్నారా?'' అంటూ ఇలా ఎన్నో ప్రశ్నలు.

పెద్ద పరీక్ష రాస్తున్నంత టెన్షన్‌గా ఉంది వినోదినికి. ఎలాగోలా అన్నిటికీ 'యస్' అని ఆన్సరిచ్చి..పరీక్ష బాగానే రాశానని అనిపించినా ఇంకా తరచి తరచి అడుగుతూ ఎలాగయినా తప్పుపట్టే ప్రయత్నం పట్టు వదలకుండా చేస్తోంది రామేశ్వరి.

కని..పెంచి...పెద్ద చేసిన పిల్ల...పెళ్లవ్వగానే అత్తగారి సొత్తయిపోతుంది దాంతో తన కూతురి మీద బాధ్యతలు తప్ప తల్లి హక్కులన్నింటినీ కోల్పోతుంది. కన్న కడుపు, అమ్మ మనసు ఆ కూతురి క్షేమం కోసం... ఆ కూతురి పిల్లల క్షేమం కోసం ఎంతగా కొట్టుకులాడినా...అది పైకి కనిపించదు. దాన్ని ఎవరూ గుర్తించరు. పైగా మాకు సంబంధించిన మనిషిని కొద్ది రోజుల కోసం మీ పర్యవేక్షణలో ఉంచాం. సరిగా చూశారా లేదా? అన్నీ సక్రమంగా, జాగ్రత్తగా జరిపించారా లేదా? అని కోర్టులో ముద్దాయిని నిలబెట్టి అడిగినట్లు అత్త, ఆడపడుచులు అడుగుతారు. ప్రశ్నల వర్షం కురిపిస్తారు. పెళ్లికాగానే ఆడపిల్ల ఎంత పరాయిదయిపోతుంది? కన్న తల్లికి, తనతో పేగు బంధం పెనవేసిన తల్లికి...ఎంత దూరమైపోతుంది- ఆశ్చర్యంగా ఉంది వినోదినికి. బాధగా ఉంది. ఈర్ష్య కూడా కలిగింది. మగపిల్లలను కన్న తల్లుల ఆధిక్యతాభావాన్ని చూస్తుంటే ఎందుకీ వ్యత్యాసం? అనిపించింది.


బారసాలకు అన్నీ సిద్ధమయ్యాయి.

బ్రాహ్మడు కూడా వచ్చి కూర్చున్నాడు.

పదకొండు రోజుల పసిపాపను ఒళ్లో పెట్టుకుని, భర్త పక్కన పీట మీద కూర్చుంది అర్చన. చాపలమీద అటుపక్క మగవాళ్లు, ఇటుపక్క ఆడవాళ్లు కూర్చున్నారు. వినోదినికి, ఆకృతికి ఇంట్లోకి...బయటకు తిరుగుతూ కావలసిన సామగ్రి అందించటంలోనే సరిపోయింది. గంభీర కంఠంతో పొల్లు పోకుండా మంత్రాలు చదువుతున్నారు పంతులుగారు.

## ఐటమ్ గాళ్

**భారత్‌లో మొట్టమొదటి డైలీ సీరియల్ 'శాంతి' ద్వారా పరిచయమైన మందిరా బేడీ ఆ తరువాత మోడలింగ్‌లోకి కూడా వచ్చింది. సోనీ టీవీలో క్రికెట్ వ్యాఖ్యాతగా ఆమధ్య కొత్త అవతారం ఎత్తిన మందిర ఇప్పుడు సరికొత్తగా ఐటెమ్ గాళ్‌గా మారింది. హీరోయిన్‌గానే నటించాలనే రూలేం పెట్టుకోకుండా ఐటమ్ సాంగ్‌లలో నటించడానికి ఉత్సాహాన్ని కనబరుస్తోంది. తమిళ చిత్రం 'మన్మధ'లో శింబుతో ఐటమ్ సాంగ్ చేసి నలుగుర్నీ ఆకట్టుకున్న మందిరా బేడీ మరిన్ని పాటల్లో డాన్స్ చేయడానికి రెడీ అవుతోంది.**



నామకరణ సమయం వచ్చింది.

బియ్యం పోసిన పళ్లాన్ని ఒళ్లో పెట్టుకుని కుడిచేతి రెండు మునివేళ్లతో బంగారు ఉంగరాన్ని పట్టుకుని పేరు రాయటానికి సిద్ధంగా ఉన్నాడు కౌండిన్య. తను ఒక పేరు అనుకున్నాడు మనసులో...రాత్రి ఒంటరిగా ఉన్నప్పుడు భార్య అర్చనతో ఆ పేరు విషయమై చర్చించి ఆమె అంగీకారం కూడా తీసుకున్నాడు.

''పేరు ఏం పెట్టదలుచుకున్నారో చెప్పండి'' అని బ్రాహ్మడు అనగానే ''మా అమ్మగారి పేరు సూర్యకాంతమ్మ. ఆ పేరే పెట్టండి'' అన్నాడు కౌండిన్య తండ్రి రంగనాథం. ''మా అమ్మ పేరు అనసూయమ్మ. వ్యవహారనామంగా 'అనసూయ' అని పెట్టి మా అత్తగారి పేరు దానికి ముందు రాయించండి. అలాగే మా కులదైవం వెంకటేశ్వరస్వామి పేరు వచ్చేలా 'వెంకట' అని కూడా రాయించండి'' అంది రామేశ్వరి.

''లక్ష్మి అని కూడా వచ్చేలా రాయించండి'' అంది ఆడపడుచు శైలజ.

మామగారు విఠల్‌రావు కూడా ఏమైనా చెబుతాడేమోనన్నట్టుగా వెంటనే పేరు రాయకుండా ఆగాడు కౌండిన్య. ఆయన మౌనంగా ఉన్నారు.

ఏం చెబితే ఏమనుకుంటారోనన్నట్లు సందేహిస్తున్న అత్తగారిని ఉద్దేశించి ''మీరూ ఎవరి పేరయినా చెప్పదలుచుకుంటే చెప్పండి అత్తయ్యగారూ'' అన్నాడు కౌండిన్య.

ఆవిడ ఏం చెబుతుందో, చెప్పింది కొడుకు తన మనవరాలి పేరుకు ఆ కొసనో, ఈ కొసనో ఎక్కడ కలిపేస్తాడోనన్న కంగారుతో ''వాళ్ల చెప్పేది లెక్కలోకి రాదురా...అమ్మాయి మన ఇంటి పిల్ల కదా పేరు నిర్ణయించాల్సింది మనమే'' అంది రామేశ్వరి.

ఆ మాటలతో ఏదో చెప్పటానికి నోరు విప్పిన వినోదిని నోరు తక్కున మూతపడింది. ముఖం కళ తప్పింది.

అది గమనించిన కౌండిన్య చాలా బాధపడ్డాడు.

మౌనంగా ఇదంతా గమనిస్తున్న అర్చన అవమానంతో వంచిన తల ఎత్తలేదు. చివరకు వెంకట శ్రీలక్ష్మి సూర్యకాంత అనసూయ అన్న పేరు నిర్ణయించారు.

రామేశ్వరి మనవరాలికి మురుగులు, ఉంగరం పెట్టింది. వినోదిని లక్ష్మీరూపు ఉన్న సన్నటి గొలుసు మెళ్లో వేసింది. కూతురు, అల్లుడితో పాటు ఆడపడుచుకు, వియ్యాలవారికి అందరికీ బట్టలు పెట్టింది.

తిరుగుప్రయాణమై వెళుతూ-''నెల వెళ్లబోయే లోగా వచ్చి అమ్మాయిని, మనవరాలిని దింపి వెళ్లండి...పిల్లసొరె సంగతి మీకు చెప్పనవసరం లేదు కదా'' అంది రామేశ్వరి.

''అదేంటండీ. మూడో నెల వచ్చాక తీసుకొచ్చి దింపుతాం. నెలలోపు అంటే పసిపిల్ల...అర్చన పచ్చి బాలింత'' అని వినోదిని అంటూండగానే ఆడపడుచు శైలజ మధ్యలో అందుకుని ''పసిపిల్లల పోషణ మా అమ్మ చాలా బాగా చేస్తుంది అత్తయ్యగారు. నలుగుపెట్టి వేడివేడి నీళ్లతో స్నానం చేయించిందంటే పిల్లలు ఎంతసేపు నిద్రపోతారో చెప్పలేను. జలుబు, దగ్గు, అజీర్తి లాంటి వాటికి అమ్మ చిట్కా వైద్యాలు కూడా బాగా చేస్తుంది'' అంది.

అలా అన్న తరువాత ఇంక తనేం మాట్లాడాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయింది వినోదిని. అదంతా విన్న కౌండిన్య వాతావరణాన్ని తేలికపరుస్తూ ''అక్కయ్యా! అసలే చలికాలం. చంటిపిల్లను బాలింతను అప్పుడే అంత దూరం ప్రయాణం చేయించటం మంచిది కాదు. అదీగాక అర్చన అక్కడికి వస్తే రెస్టుగా ఉండదు. ఏదో ఒక పనిచేస్తూ తడిలో చలిలో తిరుగుతుంది. మూడో నెల వచ్చేదాకా ఇక్కడే ఉండనీ'' అన్నాడు. ఆ మాటలకు తల్లీకూతుళ్లు ఇద్దరూ కోపంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఉక్రోషం పట్టలేని శైలజ ''తమ్ముడికి మనమీద కన్నా వాళ్ల మీదే ప్రేమ ఎక్కువ'' అంటూ కోపంతో సర్రున వాళ్ల కోసం కేటాయించిన గదిలోకి వెళ్లిపోయింది. ఆమె వెంటనే రామేశ్వరి వెళ్లింది. వాళ్లకు కోపం వచ్చిందని గ్రహించిన కౌండిన్య పరిస్థితిని చక్కబరచటానికన్నట్లు తనూ లోపలికి వెళ్లాడు. విస్తుపోయి చూస్తుండిపోయారు వినోదిని, విఠల్‌రావ్, అర్చన. గదిలో నుంచి అల్లుడి గొంతు వినబడుతోంది.

''అక్కయ్యా వాళ్లు...వాళ్లు అంటూ అత్తయ్యగారు వాళ్లని ఎందుకలా పరాయివాళ్లను చేసి మాట్లాడతావ్? మీరంతా నా కుటుంబ సభ్యులైనట్లే వాళ్లు అర్చనా వాళ్ల కుటుంబసభ్యులు! తనను కన్నవాళ్లు! నేనూ అర్చనా ఒకటైనప్పుడు మన రెండు కుటుంబాలు కూడా ఒకటై కలిసిమెలిసి ఉంటే బాగుంటుంది కదా. కొడుకు, కోడలు, మనవరాలు అని మీరు అనుకుంటున్నట్లే కూతురు, అల్లుడు, మనవరాలు అని వాళ్లు అనుకుంటే మీకెందుకంత అసహనం? పెద్దలు మీరంతా ఒకటిగా సమన్వయంతో మాకు అండగా ఉంటూ, మాకు ఆశీస్సులు అందిస్తే ఎంత బాగుంటుంది? అలాకాక ఎప్పుడు కలిసినా ఒక అశాంతిపూరిత వాతావరణాన్ని క్రియేట్ చేస్తూ ఉంటే మాకెంత బాధగా, చిరాకుగా ఉంటుందో మీకు తెలుసా? నన్ను నమ్ముకుని నా ఇంట్లో ఎప్పటికీ ఉండిపోవటానికి వచ్చిన నా భార్య తల్లిదండ్రులను మీరు కించపరిస్తే తను బాధ పడుతుంది. తను బాధ పడితే నేను సుఖంగా, సంతోషంగా ఉండగలనా?'' అని కౌండిన్య ఇంకా ఏదో అనబోతుండగా మధ్యలో అందుకుంది రామేశ్వరి.

''అవును మరి పెళ్లాం బాధపడితే నీకు కష్టంగానే ఉంటుంది. ఇందాకటి నుంచీ చూస్తున్నాను. నీ అత్తమామలను వెనకేసుకొస్తూ వాళ్ల మీద ఈగ వాలకుండా చూస్తున్నావు. అప్పుడు మాకు బాధగా ఉండదా మమ్మల్ని చిన్నచూపు చూసినందుకు'' అని అడిగింది గొంతులో నిష్ఠూరం ధ్వనిస్తుండగా.

''అమ్మా...మీరంటే తల్లిదండ్రులుగా అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ నాకు గౌరవమే. అలాగే నా భార్య తల్లిదండ్రులంటే కూడా. నా పెళ్లయినప్పటి నుంచీ చూస్తున్నాను వాళ్లంటే చిన్నచూపు మీకు. ఎప్పుడు కలిసినా ఏదో ఎగతాళిగా చిన్నబుచ్చుతూ మాట్లాడతారు. అమ్మా, నీకూ ఒక ఆడపిల్ల ఉంది కదా. నువ్వూ, నాన్నా... నీ బిడ్డను చూడటానికి వాళ్ల అత్తిగారింటికి వెళితే వాళ్లూ ఇలాగే ప్రవర్తిస్తే మీకెలా ఉంటుంది? అక్కయ్యా... నువ్వు మీ అత్తగారింట్లో ఉన్నప్పుడు నీ తల్లిదండ్రులు అక్కడికి వస్తే నీ అత్తమామలూ ఇలాగే వాళ్లను సూటిపోటి మాటలంటే నీకెలా ఉంటుంది? చిన్నప్పటి నుంచి ఆడపిల్ల పుట్టింట్లో తల్లిదండ్రుల ఆదరణలో గారాబంగా, ప్రేమగా పెరుగుతుంది. పెళ్లయి అత్తవారింటికి వెళ్లినంత మాత్రాన వాళ్లతో సంబంధాలు దూరం చేసుకోవాలా అది సాధ్యమయ్యేదేనా? మీరు అలా చేయగలుగుతున్నారా? కూతురికి ఒక పాలసీ...కోడలికి ఒక పాలసీ...అది అన్యాయమని మీ మనసులకు ఎప్పుడూ అనిపించలేదా? మా అత్తగారు, మామగారు ఆడపిల్లను కన్న తల్లిదండ్రులైనందుకు మీరేమన్నా పడుతూ, కూతురి కుటుంబ సుఖం కోసం సహనంతో భరిస్తూ మారు మాట్లాడటం లేదు. అవమానం భరించలేక మాటకు మాట ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వాళ్లూ అంటే ఇక రెండు కుటుంబాల మధ్య పైకి కనపడని సైలెంట్ వారే కదా. అది మాకు మిగిల్చేది నిరంతర మానసిక క్షోభేకదా'' అన్నాడు కౌండిన్య మనసులోనే ఎన్నాళ్లుగానో దాచుకున్న తన బాధాపూరిత భావాలను బయటపెడుతూ.

తమ్ముడి మాటలు వింటూ అత్తవారింట్లో ఉన్నప్పటికి తన మనఃస్థితిని గుర్తు తెచ్చుకుంది శైలజ. కళ్ల ముందటి విషయాలే అయినా ఒక్కోసారి ఎవరో చెబితే గానీ కళ్లకు కనిపించవు. మనసు స్పందించదు. ప్రస్తుతం అలాగే ఉంది ఆమె మనఃస్థితి.

కొడుకుతో చెప్పించుకోవలసి వచ్చినందుకు చిన్నతనంగానే ఉన్నా... లోపలి నుంచి రోషం తన్నుకుని వస్తున్నా...మనసులో మాత్రం ఆ మాటల్లోని నిజాన్ని అంగీకరించకుండా ఉండలేకపోయింది రామేశ్వరి.

రంగనాథం అప్రయత్నంగానే కూతురు శైలజ ముఖం వంక చూశాడు. ఈ ముఖం వంక చూస్తున్నప్పుడు నాలో కలిగే వాత్సల్యభావం కోడలు అర్చన ముఖం వంక చూస్తున్నప్పుడు నాలో ఎందుకు కలగటం లేదు. ఎందుకు భేదభావం? అని తనను తను ప్రశ్నించుకున్నాడు. ఆ తరువాత మనసు కోర్టులో ముద్దాయిలా నిలబడిపోయాడు.

ఇందాకటి నుంచీ గదిలో కూర్చుని ఏవేవో మాట్లాడుకుంటూ ఎంతకూ బయటికి రాని వియ్యాలవారిని చూసి 'ఏం జరిగిందో మన వలన మర్యాద లోపమేమీ జరగలేదు కదా?' అని కంగారు పడుతున్నారు వినోదిని, విఠల్‌రావు. ఓ గంట తర్వాత అందరూ బయటికి వచ్చారు. మరో గంట తర్వాత అందరూ ప్రయాణమయ్యారు. వెళ్లబోయే ముందు-

''వెళ్లొస్తాం వదినగారు. అమ్మాయిని మూడో నెల వచ్చాకే పంపించండి. మనవరాలి ఆలనా పాలనలకు మీరయితే ఒకటీ నేనయితే ఒకటీనా?'' అని వియ్యపురాలు చేతులు పట్టుకుని ఆప్యాయంగా అనటం ఆశ్చర్యపరిచింది వినోదినిని.

''వెళ్లొస్తాం బావగారు దయ ఉంచండి'' అంటూ రెండు చేతులూ ముందుకు చాచి ఆప్యాయంగా వియ్యంకుడిని కౌగిలించుకున్నాడు రంగనాథం.

''అత్తయ్యగారూ వెళ్లొస్తాను. ఆకృతి వస్తాను. అర్చనా! మా మేనకోడల్ని తీసుకొని నువ్వు మా ఇంటికీ రావాలి'' అంటూ ఆప్యాయత నిండిన చూపులతో అందరికీ వీడ్కోలు చెప్పి ఆటో ఎక్కింది శైలజ. ఆమె కళ్లల్లో పశ్చాత్తాపం ఒక పక్క, మరదలి మీద కొత్తగా పుట్టిన ప్రేమ మరొక పక్క స్పష్టంగా కనబడుతున్నాయి ఆ సమయంలో. ఇందాకటి నుంచీ ఆగకుండా ఏకధాటిగా అల్లుడి కంఠం గదిలో నుంచి వినబడటం ఆ తరువాత అందరి మనసుల్లోనూ కనిపిస్తున్న ఈ హఠాత్పరిణామం చూసి- విఠల్‌రావు, వినోదిని ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుని...ఆ తరువాత ఇద్దరూ అపురూపంగా అల్లుడ్ని చూసుకున్నారు. భర్త విశాల హృదయం మొదటి నుంచీ తెలిసిందే గనుక అర్చన అంతగా ఆశ్చర్యపోలేదు. భర్త కళ్లతో కళ్లుకలిపి కృతజ్ఞతగా చూసింది వెళ్లే సమయంలో...అంతే!

☆